సాక్షి
పార్వతీపురం మన్యం

ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



సుఖాంతమైన కిడ్నాప్ కలకలం
బాబామెట్ట వద్ద ఈ నెల ఆరో తేదీన కిడ్నాప్‌కు పాల్పడిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఆర్. గోవిందరావు తెలిపారు. - 8లో



హోరా.. హోరీగా...
ఆంధ్ర - ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ హోరా.. హోరీగా సాగుతోంది. - 8లో



కల్యాణ వైభోగమే..
మంచిరోజులు వచ్చాయి. పెళ్లిళ్ల సీజన్ ఆరంభమైంది. కొత్తజంటలతో వివాహవేదికలు కళకళలాడుతున్నాయి. - 8లో

న్యూస్‌రీల్

ఎన్నికల సిబ్బందికి శిక్షణ తప్పనిసరి



వీడియో కాన్ఫరెన్సులో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో ఎన్నికల శిక్షణ కార్యక్రమాలను విరివిగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా సూచించారు. ఎన్నికల సంసిద్ధతపై కలెక్టర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ఓటర్ల నమో దు, మార్పులు, చేర్పుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఓటర్లకు ఎన్నికల గుర్తింపు కార్డులు అందజేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, బందోబస్తు, వాహన సదుపాయం తదితర ఏర్పాట్లపై శ్రద్ధవహించాలన్నారు. కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్నిరకాల చర్యలు చేపట్టామన్నారు. ఎన్నికల సిబ్బంది జాబితాలు సిద్ధం చేశామని, సెక్టార్ అధికారులు, ఇతర విభాగాలు సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు వారంరోజుల్లో పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో జేసీ ఆర్.గోవిందరావు, సీతంపేట ఐటీడీఏ పీఓ కల్పనా కుమారి, ఇన్‌చార్జి డీఆర్వో జి.కేశవనాయుడు, పార్వతీపురం, పాలకొండ ఆర్డీఓలు కె.హేమలత, ఎ.వెంకటరమణ, తదితరులు ఉన్నారు.


చురుగ్గా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు



రామకళామందిర్ వీధి సచివాలయంలో జరుగుతున్న రిజిస్ట్రేషన్లు

పాలకొండ: పేదలందరికీ ఇళ్ల పథకం కింద ప్రభుత్వం కేటాయించిన స్థలాల రిజిస్ట్రేషన్లు చురుగ్గా సాగుతున్నాయి. సచివాలయాలు వేదికగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ సాగుతోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవు రోజుల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాలకొండలోని పలు సచివాలయాలను తహసీల్దార్ వరహాలు పరిశీలించి, రిజిస్ట్రేషన్ల తీరుపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

మెంటాడ: పేదప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్న వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మన ముఖ్యమంత్రిగా ఉండడం మనందరి అదృష్టమని ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. జక్కువ గ్రామంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన 104.6 ఎకరాల భూమికి సంబంధించిన పట్టాలను 104 మంది రైతులకు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ, అభివృద్ధి పాలన అందజేయడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దేశంలోనే కొత్త ఒరవడి సృష్టించారన్నారు. 18 గ్రామాలకు చెందిన రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ చర్యలతో పేదకుటుంబాల పిల్లల్లో విద్యావెలుగులు ప్రకాశిస్తున్నాయన్నారు. ఇప్పుడు అందుతున్న సంక్షేమ పథకాలన్నీ కొనసాగాలంటే మళ్లీ మనం జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలన్నారు. ఆంధ్రా ప్రాజెక్టు ఆధునికీకరణకు రూ. 20కోట్లు, గుర్ల ప్రాజెక్టుకు రూ.14కోట్లు మంజూరు చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తిచేశామన్నారు. కార్యక్రమంలో జక్కువ సర్పంచ్ సత్యవతి, ఎంపీటీసీ కర్రి సంధ్య, నాయకులు రెడ్డి అప్పారావు, అప్పలనాయుడు, ఈశ్వరరావు, ఆర్.రామారావు, జేసీఎస్ కన్వీనర్ త్రినాథ్, రత్నాకరనాయుడు, ఎం.అప్పలనాయుడు పాల్గొన్నారు.



పల్లె ప్రగతికి.. నిధుల మూట

- 15వ ఆర్థిక సంఘం రెండవ దశ నిధులు విడుదల
- జిల్లాకు రూ.15.80 కోట్లు మంజూరు
- తొలి దశలో రూ.10.34కోట్లు
- జిల్లాలో గ్రామాల అభివృద్ధికి మొత్తం 26.14కోట్లు
- ఇప్పటి వరకు అభివృద్ధికి వెచ్చించిన మొత్తం రూ.8.72కోట్లు
- ఆర్థిక సంఘం నిధులతో గ్రామాల్లో మరింత అభివృద్ధి



కొమరాడలో సీసీ రోడ్డు నిర్మాణం (ఫైల్)

పార్వతీపురంటౌన్: పల్లె ప్రగతికి ప్రభుత్వం నిధుల మూటను అందించింది. 15వ ఆర్థిక సంఘం నిధులను పూర్తిస్థాయిలో విడుదల చేసింది. గతంలో తొలిదశ నిధులు రాగా, ఇప్పుడు రెండవ దశ నిధులను మంజూరు చేసింది. వీటిని గ్రామ పంచాయతీలలో రోడ్లు, కాలువల నిర్మాణాలు, పారిశుద్ధ్య నిర్వహణ, తాగునీటి సదుపాయం కల్పన వంటి పనులకు వినియోగించనుంది. వేసవి సమీపిస్తున్న తరుణంలో శివారు, నీటి ఎద్దడి ప్రాంతాలకు తాగు నీటి సరఫరాకు మెరుగైన చర్యలు తీసుకునే అవకాశం పంచాయతీలకు దక్కనుంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 15 మండలాల పరిధిలో 451 గ్రామ పంచాయతీలున్నాయి. వీటికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 15వ ఆర్థిక సంఘం నిధులు రెండు దశలుగా విడుదలయ్యాయి. రెండు దశలు కలిపి రూ.26.14 కోట్లు జిల్లాకు కేటాయించగా, తొలి దశలో రూ.10.34 కోట్లు, రెండవ దశలో రూ.15.80 కోట్లు విడుదల చేసింది.

అభివృద్ధి పనులకు అధిక ప్రాధాన్యం

తొలి దశలో మంజూరైన ఆర్థిక సంఘం నిధుల్లో తాగునీరు, పారిశుద్ధ్య పనులకు రూ.2,60,14,473 కేటాయించగా, రెండవ దశ నిధులలో రూ.6,28,81,864 వెచ్చించనున్నారు. రోడ్లు, కాలువల నిర్మాణాలకు తొలిదశలో రూ.7,74,08,108 లు కేటాయించగా, రెండవ దశలో రూ.9,51,48,236 చొప్పున మొత్తం రూ.1,72,55,6344 కేటాయించారు.



పార్వతీపుం మండలం పెదబొండపల్లి గ్రామంలో పారిశుద్ధ్య పనుల్లో గ్రీన్ అంబాసిడర్లు (ఫైల్)

రూ.8.72కోట్లతో పనులు పూర్తి

జిల్లా వ్యాప్తంగా 15 మండలాల్లో తొలి దశలో మంజూరైన నిధులతో గ్రామాల్లో పలు అభివృద్ధి పనులు పూర్తి చేశారు. తాగునీరు, పారిశుద్ధ్యం, డ్రైన్లు, రోడ్ల నిర్మాణాలు చేపట్టారు. తొలివిడత మంజూరైన 10.34 కోట్లలో 8.72కోట్లు ఖర్చుచేసి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దారు. తొలివిడత మంజూరైన నిధులలో రూ.1.62కోట్లు మిగిలిన మొత్తాన్ని వివిధ అభివృద్ధి పనులకు ప్రణాళికలు రూపొందించినట్టు అధికారులు తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంలో ఎటువంటి అవకతవకలు జరగకుండా ప్రభుత్వం పలు రకాల చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా నిధులను ఆన్‌లైన్ ద్వారానే కాంట్రాక్టర్‌కు చెల్లించాలని నిర్ణయించింది. గతంలో కాంట్రాక్టర్లకు నేరుగా చెక్ రాసి చెల్లించేవారు. ఇప్పుడు జీఎస్టీ బిల్లు, ఇతర అనుమతులు పక్కాగా ఉన్నవారికి నేరుగా ఆన్‌లైన్‌లో చెల్లించాల్సి రావడంవల్ల పనులు పారదర్శకంగా జరగనున్నాయి.

జిల్లాకు 15వ ఆర్థిక సంఘం నిధులు ఇలా...

మండలం	తొలివిడత బేసిక్ నిధులు	తొలి విడత టైడ్ నిధులు	రెండోవిడత బేసిక్ నిధులు	రెండోవిడత టైడ్ నిధులు
భామిని	రూ. 7,97,629	రూ.41,81,045	రూ.33,59,279	రూ.50,83,009
పాలకొండ	రూ.4,62,381	రూ.41,02,307	రూ.35,53,780	రూ.53,77,320
సీతంపేట	రూ.21,44,947	రూ.55,16,951	రూ.46,44,294	రూ.70,27,404
వీరఘట్టం	రూ.12,19,371	రూ.65,46,741	రూ.49,95,269	రూ.75,58,477
బలిజిపేట	రూ.5,97,036	రూ.54,53,367	రూ.49,32,757	రూ.74,63,880
గుమ్మలక్ష్మీపురం	రూ.4,13,765	రూ.39,25,772	రూ.38,19,757	రూ.57,79,773
గరుగుబిల్లి	రూ.33,56,192	రూ.51,91,532	రూ.35,25,772	రూ.53,34,943
జియ్యమ్మవలస	రూ.4,99,750	రూ.45,35,773	రూ.42,08,083	రూ.63,67,367
కొమరాడ	రూ.44,43,497	రూ.67,23,816	రూ.44,45,547	రూ.67,26,680
మక్కువ	రూ.31,87,253	రూ.53,12,411	రూ.39,87,706	రూ.60,33,904
పాచిపెంట	రూ.5,54,587	రూ.44,63,126	రూ.42,17,985	రూ.63,82,351
పార్వతీపురం	రూ.31,41,758	రూ.59,99,691	రూ.45,43,44	రూ.68,74,807
కురుపాం	రూ.4,60,099	రూ.40,11,116	రూ. 37,72,932	రూ.57,08,923
సాలూరు	రూ.5,36,048	రూ.49,04,640	రూ.43,31,834	రూ.65,54,618
సీతానగరం	రూ.42,00,160	రూ.65,39,820	రూ.45,43,429	రూ.68,74,780

పారదర్శకంగా నిధుల ఖర్చు



వేసవి సమీపిస్తున్న తరుణంలో ఆర్థిక సంఘం నిధులు విడుదల కావడం శుభదాయకం. తాగునీటి ఎద్దడిని నివారించేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుంది. రోడ్లు, కాలువల నిర్మాణానికి నిధులు వెచ్చిస్తాం. ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చుచేస్తాం. బేసిక్ నిధులు, టైడ్ నిధులను ఆయా రేషియోలో ఆయా పనులకు కేటాయించాల్సి ఉంది. పనులను కూడా పారదర్శకంగా చేస్తాం.

– బలివాడ సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి, పార్వతీపురం మండలం

- రూ.195.34 కోట్ల వ్యయంతో ఆధునికీకరణ పనులు
- ఎడమకాలువలో 16.843 కి.మీ, కుడికాలువలో 9.376 కి.మీ మేర కాంక్రీట్ పనులు పూర్తి
- ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు
- చంద్రబాబు పాలనలో 2014-2018 వరకు కరువు పరిస్థితి
- సాగునీటికి తప్పని తంటాలు
- ఈనాడు విషపు రాతలపై జలవనరులశాఖ అధికారుల ఆగ్రహం

వైఎస్సార్‌సీపీ హయాంలోనే..

తోటపల్లికి కొత్తకళ

ఫ్యాక్ట్ చెక్

వీరఘట్టం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏ శుభ ముహూర్తాన రాష్ట్రంలో అధికారం చేపట్టిందో అప్పటి నుంచి వ్యవసాయం పండగలా మారింది. సకాలంలో వర్షాలు కురుస్తున్నాయి. జలాశయాలు నిండుతున్నాయి. పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల రైతులకు సాగునీటి ఆధారమైన తోటపల్లి జలాశయం ఏటా నీటితో కళకళలాడుతోంది. జలవనరుల శాఖ అధికారులు ప్రణాళికా బద్ధంగా ఆయకట్టుకు సాగునీరు సరఫరా చేస్తున్నారు. రైతులకు సాగునీటి వెతలు లేకుండా, సాగును సస్యశ్యామలం చేస్తున్నారు. వాస్తవ పరిస్థితులను విస్మరిస్తూ శనివారం 'ఈనాడు' పత్రిక అచ్చేసిన అసత్యాలపై జలవనరులశాఖ అధికారులు మండిపడుతున్నారు.

గత టీడీపీ పాలనలో అంతా కరువే...

గత టీడీపీ పాలనలో తోటపల్లి ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. 2014లో టీడీపీ అధికారం చేపట్టిన ఏడాదే అక్టోబర్ 8 నుంచి 14 వరకు హుద్‌హుద్ తుఫాన్ విలయతాండవం చేస్తూ వరి రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. ఈ తుఫాన్‌లో పంటలు నష్టపోయిన రైతులను అప్పటి పాలకులు విస్మరించారు. తమ బినామీల పేర్లు నమోదు చేసి పంటల పరిహారాన్ని స్వాహా చేశారు. 2015 నవంబర్‌లో చాప్లా తుఫాన్ ప్రభావంతో పంటలకు నష్టం కలిగింది. మరుచటి ఏడాది 2016 ఆగస్టు 18న తోటపల్లి ఎడమకాలువలో పెద్దబుడ్డిడి వద్ద ఉన్న బ్రిటిష్ కట్టడం సైఫన్‌కు భారీ గండిపడింది. దీంతో సైఫన్‌కు దిగువన ఉన్న 30 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందక పంటలు ఎండిపోయాయి. 2017 ఖరీఫ్‌లో ఫణి తుఫాన్ పంటలలను నష్టపరిచింది. 2018లో అక్టోబర్ 8 నుంచి 12 వరకు సంభవించిన తిత్లీ తుఫాన్ దాటికి పంటలు సమూలంగా నేలమట్టమయ్యాయి. ఇలా 2014 నుంచి 2018 వరకు చంద్రబాబు పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా కరువు ఏర్పడడంతో పాటు తోటపల్లి పాత ఆయకట్టు రైతులు తీవ్ర కరువు పరిస్థితులను ఎదుర్కొన్నారు. తోటపల్లి పాత ఆయకట్టు కాలువల ఆధునీకీకరణకు చంద్రబాబు ప్రభుత్వం ముందుకు రాలేదు. 2019లో సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తోటపల్లి కాలువలకు ఆదరాబాదరాగా నిధులు మంజూరు చేసి వీరఘట్టం మండలం అచ్చెపువలస వద్ద శంకుస్థాపన పనులు చేట్టి రైతులను మోసగించే ప్రయత్నం చేశారు.



తోటపల్లి ఎడమ ప్రధాన కాలువ లైనింగ్ పనులు ఇలా...

2020లో తోటపల్లి ఆధునీకీకరణ పనులకు శ్రీకారం

టీడీపీ ప్రభుత్వం 2019లో చేపట్టిన అరకొర పనులు వెంటనే ఆగిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ సీనియర్ నాయకులు పాలవలస రాజశేఖరం, పాలకొండ, రాజాం ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, కంబాల జోగులు, ప్రస్తుత ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌లు తోటపల్లి కాలువల ప్రాధాన్యతను, ఇక్కడ రైతులు, పంటల పరిస్థితిని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. టీడీపీ పాలనలో జరిగిన పొరపాట్లును సవరిస్తూ తోటపల్లి కాలువలకు రూ.195.34 కోట్లు నిధులను ప్రభుత్వం మంజూరు చేసింది. అంతేకాక టీడీపీ హయాంలో జరిగిన అరకొర పనులకు కూడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించింది. తర్వాత చకచకా పనులు ప్రారంభించింది.

ఇంత వరకు జరిగిన పనులు ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తోటపల్లి కాలువల ఆధునీకీకరణ పనులపై దృష్టి సారించింది. 37.536 కి.మీలు పొడవున్న ఎడమకాలువలో ఇంతవరకు 16.843 కి.మీ వరకు కాంక్రీట్ పనులు పూర్తయ్యాయి. అలాగే, 17.616 కి.మీ పొడవున్న కుడికాలువలో 9.376 కి.మీ వరకు కాంక్రీట్ పనులు చేపట్టారు. మొత్తం 55.152 కి.మీలకు గాను ఇంత వరకు 26.919 కి.మీ (38 శాతం) పనులు చేపట్టారు. ఎడమకాలువలో అచ్చపువలస, 6వ బ్రాంచ్, ఎం.రాజపురం, కత్తులకవిటి వద్ద వెడల్పయిన వంతెనలు నిర్మించి వాహనరాకపోకలకు మార్గం సుగమం చేశారు. ఇలా నీటి పంపిణీకి ఎటువంటి ఇబ్బందులు లేకుండా గత ఖరీఫ్‌లో చర్యలు చేపట్టి శివారు వరకు సాగునీరందించారు. ఇలా ఒక పక్క ఆధునికీకరణ పనులు చేపడుతూ మరోపక్క గత ఐదు ఖరీఫ్ సీజన్లలో సకాలంలో కాలువలకు సాగునీరందిస్తూ ప్రభుత్వం తోటపల్లి ఆయకట్టును సస్యశ్యామలం చేస్తుంటే, తోటపల్లి కాలువ పనులపై ఈనాడు తప్పుడు వార్తలు రాస్తుండడం ఎంత వరకు సమంజసమని జలవనరులశాఖ అధికారులు ప్రశ్నిస్తున్నారు. ఈనాడు అసత్యాలు రాస్తోందంటూ రైతులు వాపోతున్నారు.

పుష్కలంగా సాగునీరు..



గత ఖరీఫ్ సీజన్‌లో శివారు ఆయకట్టుకు సైతం సాగునీరు పుష్కలంగా అందించాం. ఈ ఏడాది పంటల దిగుబడి బాగా వచ్చిందని రైతులు చెబుతున్నారు. కుడి, ఎడమ కాలువల ఆధునికీకరణ మిగులు పనులు ఈ నెలాఖరుకు పునఃప్రారంభిస్తాం. పెండింగ్ బిల్లులు కూడా కొద్దిరోజుల్లో విడుదల చేస్తామని ప్రభుత్వం స్పష్టం చేసింది.

– దమలపాటి రవికుమార్, డీఈఈ, జలవనరులశాఖ, పాలకొండ డివిజన్



ఇటీవల నిర్మించిన తారు రోడ్డు

● కొత్త దారి

సీతంపేట–పాలకొండ రోడ్డు అభివృద్ధిని గత టీడీపీ ప్రభుత్వం విస్మరించింది. రోడ్డంతా గోతులమయం కావడంతో రాకపోకలకు వాహనచోదకులు ఇబ్బంది పడేవారు. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.2కోట్ల వ్యయంతో కొత్తగా తారు రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేసింది. నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో ప్రయాణాలను సుఖవంతం చేసింది. దీనికి ఈ రోడ్డు చిత్రాలే నిదర్శనం.

- సీతంపేట



గతంలో రహదారి ఇలా...

దేవదాయ శాఖలో పదోన్నతులు, బదిలీలు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): సుదీర్ఘకాలం తర్వాత దేవదాయ శాఖలో ఈవోలకు పదోన్నతులు, బదిలీలు జరిగాయి. సహాయ కమిషనర్లకు ఉప కమిషనర్లగాను, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, సూపరింటెండెంట్‌లకు సహాయ కమిషనర్లగా పదోన్నతులు కల్పించారు. ఈ మేరకు దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు.

విజయనగరంలోని రామ తీర్థాలు దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్(ఈవో) బి.హెచ్.ఎస్.ఎన్.కిషోర్ కుమార్‌కు డిప్యూటీ కమిషనర్(డీసీ)గా పదోన్నతి కల్పిస్తూ తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఈవోగా నియమించారు. అన్నవరం దేవస్థానంలో అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)గా పనిచేస్తున్న డి.వి.ఎల్.రమేష్ బాబుకు డిప్యూటీ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ శ్రీకాకుళం జిల్లాలోని అరసవిల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా నియమించారు. కోనసీమ జిల్లాలో ఏసీగా పనిచేస్తున్న కె.ఎస్.డి.వి. ప్రసాద్‌కు డీసీగా పదోన్నతి కల్పిస్తూ విజయనగరంలోని మాన్సాస్ ట్రస్ట్ ఈఓగా నియమించారు. ఇక్కడ ఈవోగా పనిచేస్తున్న డీవీవీ ప్రసాద్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. సింహాచలం దేవస్థానంలో గతంలో ఏఈఓగా పనిచేసి ప్రస్తుతం అన్నవరంలో ఏఈవోగా పని చేస్తున్న వై.శ్రీనివాసరావుకు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తూ రామతీర్థాలు దేవస్థానం ఈవోగా నియమించారు. శ్రీకాకుళం జిల్లాలో ఏసీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న బలివాడ ప్రసాద్ పట్నాయక్‌కు సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి అదే జిల్లా ఏసీగా నియమించారు. అక్కడ ఏసీగా పనిచేస్తున్న హరి సూర్య ప్రకాష్‌కు పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంది. ఇసుక కొండ శ్రీ సత్యనారాయణ స్వామివారి దేవస్థానం ఈవో బి.నగేష్‌బాబును సహాయ కమిషనర్‌గా పదోన్నతి కల్పించి తూర్పుగోదావరి జిల్లా మావుళ్లమ్మ దేవస్థానం ఈవోగా నియమించారు.

క్లుప్తంగా

పొలంలో వ్యక్తి మృతి


మృతుడు వీర్రాజు

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీలో కుమ్మరి వీధికి చెందిన పెనుగుర్తి వీర్రాజు(41) శనివారం సాయంత్రం పొలంలో పంటను పశువులు తినేస్తున్నాయని, వాటిని తోలబోతూ గట్టును తన్నేసి పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. బీసీ కాలనీకి సమీపంలో ఇటుక బట్టీలో ఇటుకలు తయారు చేస్తుండగా పక్కనే ఉన్న మొక్కజొన్న పొలంలో పశువులు పంటను తినేస్తున్నాయని వాటిని తోలేందుకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు మట్టిగట్టు తన్నేసి పడిపోయాడు. సమీపంలో ఉన్న వారు అతన్ని వెంటనే ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీర్రాజు మృతితో కుమ్మరివీధిలో విషాదం నెలకొంది.

గాయపడిన వ్యక్తి మృతి


కలమట రతాలు (ఫైల్)

వంగర: మండల పరిధి రుషింగి–రాజులగుమ్మడ గ్రామాల మధ్య ఈ నెల 5వ తేదీన జరిగిన ఆర్టీసీ బస్సు–ఆటో ఢీకొట్టిన ఘటనలో తీవ్రంగా గాయపడిన కలమట రతాలు(62) శనివారం వేకువజామున మృతి చెందాడు. అప్పట్లో జరిగిన ఘటనలో 13 మంది వరకు గాయపడిన విషయం తెలిసిందే. రతాలు పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రాగోలు ఆస్పత్రికి తరలించి చికిత్సను అందించారు. పరిస్థితి విషమించడంతో ఆయన మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు రాజశేఖర్, కుమార్తె ప్రేమలత ఉన్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన తమను ఆదుకోవాలని కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

130 మద్యం బాటిల్స్ సీజ్


సంతకవిటి: స్వాధీనం చేసుకున్న మద్యం నిల్వలతో పోలీసులు

సంతకవిటి: మండల పరిధి మండవకురిటి గ్రామంలో ఓ వ్యాపారి వద్ద అక్రమంగా నిల్వ ఉంచిన 130 మద్యం బాటిల్స్‌ను సీజ్ చేసినట్టు ఏఎస్ఐ ఎం.వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం రాత్రి గ్రామంలో జరిపిన దాడుల్లో అక్రమ నిల్వలు కలిగినట్టు గుర్తించామని, వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్టు ఏఎస్ఐ తెలిపారు.

డెంకాడ: చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్ సమీపంలో ద్విచక్ర వాహనంపై 51 మద్యం బాటిళ్లు తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు. శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో ధర్మపురి గ్రామానికి చెందిన కె.నర్సింగరావును తనిఖీ చేయగా మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కల్యాణ వైభోగమే...

కొత్త సంవత్సరంలో పెళ్లిళ్ల సీజన్ మొదలైంది. పెళ్లి కళ వచ్చేసింది. వధూవరులు ఒక్కటయ్యేందుకు ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో ఇప్పటికే మంచి ముహూర్తాలు పురోహితులు కట్టేశారు. ఇక భాజాభజింత్రీలు మోగడమే ఉంది. శనివారం నుంచి పెళ్లిళ్లు మొదలయ్యాయి. కల్యాణ మండపాలు ముస్తాబయ్యాయి. విద్యుద్దీపలంకరణలతో మండపాలు వెలిగిపోతున్నాయి. తరతమ తహతుల్లో ఎవరికి తగ్గట్టు వారు జీవితంలో మధురానుభూతి మిగిల్చే వివాహాన్ని వేడుకగా జరిపేందుకు సిద్ధమయ్యారు. పెళ్లి ముహూర్తాలు ఏప్రిల్ 26 వరకు కొనసాగనున్నాయి. దీంతో ఊరూవాడా పెళ్లి సందడి నెలకొంది.


అందంగా ముస్తాబైన కల్యాణ వేదిక



- ప్రారంభమైన శుభ ముహూర్తాలు
- ఏప్రిల్ 26 వరకు మంచి రోజులు
- వేల సంఖ్యలో జరగనున్న పెళ్లిళ్లు
- మళ్లీ ఆగస్టులో ప్రారంభం కానున్న ముహూర్తాలు
- జోరందుకున్న వస్త్ర, బంగారు వ్యాపారాలు

వీరఘట్టం: వివాహం ప్రతీ ఒక్కరి జీవితంలో మధురానుభూతి. వధూవరులకు అతి పెద్ద పండగ. పిల్లల వివాహాలు వైభవంగా అందరూ మెచ్చుకునేలా ఉండాలని తల్లిదండ్రుల ఆరాటపడుతుంటారు. అందుకే కాస్త ఆలస్యమైనా అన్నీ సవ్యంగా కుదిరాకే పెళ్లిళ్లు చేస్తుంటారు. గతేడాది డిసెంబర్ 18 నుంచి ఈ నెల 9 వరకు శుభముహూర్తాలు లేక వేల సంఖ్యలో ఎదురుచూస్తున్న యువతీ, యువకులకు శనివారం నుంచి శుభ ఘడియలు వచ్చాయి. శుభ ముహూర్తాలు రావడంతో ఇక జరగబోవు పెళ్లిళ్లను అంగరంగ వైభోగంగా జరిపేందుకు కొత్త జంటలు సిద్ధమవుతున్నారు. ప్రతీ ఏటా ఎక్కువగా వేసవి పెళ్లిళ్ల సీజన్‌కు అనువుగా ఉంటుంది. ఈ ఏడాది ట్రెండ్ మారింది. సుముహూర్తాలు తక్కువగా ఉండడంతో ఆలస్యం, అమృతం, విషం అన్నట్టు.. నిశ్చయ తాంబూలాలు తీసుకున్నది మొదలు ఉరుకులు, పరుగులతో పెళ్లిళ్లు కానిచ్చేస్తున్నారు. ఈ నెల 10 నుంచి ఏప్రిల్ 26 వరకు సుమారు 38 మంచి ముహూర్తాలు ఉండడంతో అందరూ పెళ్లి పనుల్లో బిజీగా ఉన్నారు.

వేల సంఖ్యలో వివాహాలు

ఫిబ్రవరిలో 13 ముహూర్తాలు, మార్చి నెలలో 12 శుభ ముహూర్తాలు, ఏప్రిల్‌లో మరో 13 ముహూర్తాలు ఉన్నాయి. మే, జూన్ రెండు నెలలూ శుక్రమూఢం, జూలై నెలంతా ఆషాడం కావడంతో ఆగస్టు 5 వరకు ముహూర్తాలే లేవు. అందుచే ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అధిక సంఖ్యలో వివాహాలు జరిపించేందుకు తల్లిదండ్రులు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో కల్యాణ మండపాలు రిజర్వ్ చేసుకుంటున్నారు. డెకరేషన్, క్యాటరింగ్, మంగళ వాయిద్యాలకు అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

జోరుగా వ్యాపారం

పెళ్లిళ్ల సీజన్ కావడంతో విజయనగరంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలో వ్యాపారాలు జోరందుకున్నాయి. ఈ రెండు జిల్లాల్లో రోజుకు రూ.5 నుంచి రూ.7 కోట్ల వ్యాపార లావాదేవీలు జరుగుతున్నట్టు వ్యాపార వర్గాలు చెబుతున్నాయి. విజయనగరం, పార్వతీపురం, పాలకొండ, వీరఘట్టం ప్రాంతాల్లో బంగారం, వస్త్ర వ్యాపారాలు జోరందుకున్నాయి. అలాగే భజంత్రీలు, ఫ్లవర్ డెకరేటర్లు, పురోహితులు, వంట మాస్టర్లు, స్వీట్లు, ఫొటో, వీడియో గ్రాఫర్లకు, కల్యాణ మండపాలకు మంచి డిమాండ్ పెరిగింది.

ఇవీ శుభ ముహూర్తాలు

ఫిబ్రవరి నెలలో 10, 13, 14, 16, 17, 18, 19, 22, 23, 24, 26, 28, 29 తేదీలు.
మార్చి నెలలో 2, 3, 4, 6, 16, 21, 22, 24, 25, 27, 28, 31 వరకు ముహూర్తాలు ఉన్నాయి.
ఏప్రిల్ నెలలో 1, 3, 4, 5, 12, 13, 18, 19, 20, 21, 22, 24, 26 వరకు ముహూర్తాలు ఉన్నాయి.

ఏప్రిల్ 27 నుంచి శుక్రమూఢం, గురు మూఢం సుమారు 70 రోజులు ఉన్నాయి. అలాగే జూలై నెలంతా ఆషాడం కావడంతో ఏప్రిల్ 27 నుంచి సుమారు 101 రోజులు ముహూర్తాలు లేవు. అంతేకాకుండా ఈ నెల 16న రథసప్తమి, మార్చి 8న శివరాత్రి, ఏప్రిల్ 9న ఉగాది పండగలు జరగనున్నాయి.

మూడు నెలల్లో మంచి ముహూర్తాలు



ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో అధికంగా ముహూర్తాలు ఉన్నాయి. నిర్ణయించిన తేదీల్లో అధిక సంఖ్యలో పెళ్లిళ్లు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే అధిక సంఖ్యలో ముహూర్తాలు కట్టాం.
– ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజి, యజ్ఞకర్త, వీరఘట్టం

ఈ సీజన్ బాగుంది..



ఈ ఏడాది ప్రస్తుత సీజన్‌లో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఒకే రోజు రెండు మూడు పెళ్లిళ్లకు అడ్వాన్సులు ఇచ్చారు. ఒత్తిడి పెరుగుతుండడంతో సాధ్యమైనంత వరకు బుకింగ్‌లు చేస్తున్నాం. పూర్తి స్థాయిలో కల్యాణ మండపాలను సిద్ధం చేసి నూతన వధూవరులను డెకరేషన్‌తో మంత్రముగ్ధులను చేసేందుకు కొత్త కొత్త వెరైటీలు తెప్పించాం.
– బెజ్జిపురం నాని, శుభం సప్లైయర్స్, వీరఘట్టం


కొత్త కొత్త రకాలు



ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ మూడు నెలల్లో ముహూర్తాలు ఎక్కువగా ఉన్నాయి. కొత్త కొత్త రకాల మిఠాయిలు సిద్ధం చేస్తున్నాం. నేతి మిఠాయిలు అడుగుతున్నారు. కోరిన రీతిలో స్వీట్లు చేస్తున్నాం. కొందరు లైవ్ బెల్లం జిలాబీలు అడుగుతున్నారు. అందుకోసం అనకాపల్లి నుంచి బెల్లం తెప్పిస్తున్నాం. సారె కోసం పెద్ద లడ్డూలు, కాజాలు కూడా భారీగానే ఆర్డర్లు వస్తున్నాయి. పెళ్లిళ్ల సీజన్ కావడంతో వ్యాపారం ఊపందుకుంది.
– అర్నిపల్లి శ్రీనివాసరావు, అజరా స్వీట్స్, వీరఘట్టం

హోరా.. హోరీగా...
ఆంధ్ర – ఉత్తరప్రదేశ్ జట్ల రంజీ మ్యాచ్

- 198 పరుగులకే ఆలౌటైన ఉత్తరప్రదేశ్ జట్టు
- 5 వికెట్లు దక్కించుకున్న ఆంధ్రా ఆల్ రౌండర్ శశికాంత్


94 పరుగులు చేసిన ఆంధ్రా కెప్టెన్ రిక్కీబుయ్


బౌలింగ్‌లో 5 వికెట్లు తీసిన శశికాంత్

విజయనగరం: ఆంధ్ర – ఉత్తరప్రదేశ్ జట్ల మధ్య జరుగుతున్న రంజీ మ్యాచ్ హోరా.. హోరీగా సాగుతోంది. డెంకాడ మండలం చింతలవలసలో గల డాక్టర్ పీవీజీ రాజు ఏసీఏ స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో 236 పరుగులకు నాలుగు వికెట్ల నష్టంతో రెండవ రోజు శనివారం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్రా జట్టు మొత్తం 95.1 ఓవర్లలో 261 పరుగులు ఆలౌటైంది. జట్టు బ్యాటింగ్‌లో కెప్టెన్ రిక్కీ బుయ్ 94 పరుగులు, కెవి.శశికాంత్ 72 పరుగులు, కరణ్ షిండే 45 పరుగులతో రాణించారు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఉత్తరప్రదేశ్ క్రీడాకారులు 51.5 ఓవర్లలో 198 పరుగులకు మైదానం నుంచి వెనుదిరిగారు. ఆంధ్రా బౌలర్ కెవి.శశికాంత్ అటు బ్యాట్‌తో పాటు ఇటు బంతితో రాణించాడు. మొత్తం 15 ఓవర్లు వేసి 5 వికెట్లు చేజిక్కించుకుని ఉత్తరప్రదేశ్ జట్టును కుప్పకూల్చాడు. బ్యాటింగ్‌లో ఉత్తరప్రదేశ్ క్రీడాకారుడు ఆర్యన్ జూయల్ 60 పరుగులు మినహా మిగిలిన క్రీడాకారులు ఎక్కువ సమయం మైదానంలో నిలవలేకపోయారు. అనంతరం రెండవ ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన ఆంధ్ర జట్టు రెండవ రోజు ఆట ముగిసే సమయానికి 4.3 ఓవర్లలో వికెట్ నష్టపోయి 19 పరుగులు జోడించారు.

పెళ్లి కబురు చెప్పి వస్తూ పరలోకానికి

- బొమ్మిక – గురండి మధ్య రోడ్డు ప్రమాదం
- ఏజీ రోడ్డులో కారు ఢీకొని రెండు బైక్‌లు ధ్వంసం
- ఒకరి మృతి, ముగ్గురి పరిస్థితి విషమం
- గురండిలో విషాదం


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పప్పల సుగ్రీవులు


ప్రమాద స్థలంలో నుజ్జయిన కారు, బైక్‌లు


సుగ్రీవులు(ఫైల్)

భామిని: అన్న కుమారుడు పెళ్లికని చెప్పడానికి వెళ్లి వస్తూ జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. గురండికి చెందిన పప్పల సుగ్రీవులు(47) అన్న కుమారుడు అంజి వివాహం ఈ నెల 26న జరగనుంది. పెళ్లి కార్డులు పంచేందుకు బంధువుల ఇళ్లకని సుగ్రీవులు తన భార్య శ్రీదేవితో కలిసి శనివారం ఇంటి నుంచి తన బైక్‌తో బయలుదేరారు. తరువాత పెళ్లి సామాన్లు బెత్తాయించుకొని స్వగ్రామానికి రాత్రి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో భామిని మండలం బొమ్మిక – గురండి మధ్య ఏబీ రోడ్డుపై వీరితో పాటు మరో బైక్ వస్తుండగా భామిని నుంచి బత్తిలి వెళ్తున్న కారు రెండు బైక్‌లను బలంగా ఢీకొందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌లు, కారు రోడ్డుకు ఆవల వైపు పడి తునాతునకలయ్యాయి. ఈ ప్రమాదంలో సుగ్రీవులు, భార్య శ్రీదేవితో పాటు రెండో బైక్‌పై ప్రయాణిస్తున్న పప్పల మధు, ఈశ్వరి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో ప్రమాద స్థలానికి చేరుకున్న 108 అంబులెన్స్‌లో క్షతగాత్రులను భామిని పీహెచ్‌సీకి వెంటనే తరలించారు. అప్పటికే సుగ్రీవులు మృతి చెందినట్టు వైద్యులు వెల్లడించారు. మిగతా ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం సీతంపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో గురండిలో విషాదం అలుముకొంది. పెళ్లింట చావు కబురు విని బంధువులు బోరున విలపించారు. బత్తిలి ఎస్ఐ చిట్టిపోలు ప్రసాద్ ప్రమాద స్థలానికి చేరుకొని పరిస్థితి సమీక్షించారు. ఆస్పత్రిలో వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడికి కుమారులు మహేష్, తేజ ఉన్నారు.

భూ తగాదాలో వ్యక్తి దారుణ హత్య

పాచిపెంట: భూ తగాదాలో ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. దీనికి సంబంధించి సాలూరు రూరల్ సీఐ బాలకృష్ణ తెలిపిన వివరాలు.. మండలంలోని పాచిపెంట పంచాయతీ గడివలస గ్రామానికి చెందిన కోరాడ జోగేశ్వరరావు శనివారం ఉదయం తన పొలంలో మొక్కజొన్న చేనుకు నీరు కట్టేందుకు వెళ్లి హత్య కాబడ్డాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ బాలకృష్ణ సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. వ్యవసాయ పనులకు ఉపయోగించే కోడవలి వంటి ఆయుధంతో పీక కోసి చంపినట్టుగా గుర్తించారు. గతంలో ఉన్న భూతగాదాల కారణంగా జోగేశ్వరరావుకు వరుసకు అన్నయ్య అయిన కోరాడ నరసింహులు హత్య చేసి ఉంటాడని అనుమానిస్తూ, మృతుడి భార్య గర్రెమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.


పొలంలో హత్యకు గురైన జోగేశ్వరరావు

Government of Andhra Pradesh
Endowments Department
E-PROCUREMENT TENDER NOTICE

Re-Construction of Mandapam of **Sri Uma Sahitha Kamalingeswara Swamy Temple** at Galavilli (V), Balijipeta (M), Parvathipuram Manyam District. **NIT NO.P/COE/1487/2023-8, Dt.18.12.2023.** For further details log onto website **"https://tender.apeprocurement.gov.in"** for further details contact Ph. 9741595461, 9491598948.

EXECUTIVE AUTHORITY
Sri Uma Sahitha Kamalingeswara Swamy Temple
Galavilli (V), Balijipeta (M), Parvathipuram Manyam District.

సుఖాంతమైన కిడ్నాప్ కలకలం


- బాబామెట్టలో కిడ్నాప్‌కు పాల్పడిన సుపారీ గ్యాంగ్ అరెస్ట్
- ముగ్గురు వ్యక్తులు, ఒక మహిళ, ఇద్దరు జువైనల్స్ అరెస్ట్
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ గోవిందరావు


వివరాలు వెల్లడిస్తున్న విజయనగరం డీఎస్పీ గోవిందరావు (వెనుక ముసుగులో నిందితులు)

విజయనగరం క్రైమ్: బాబామెట్టలో ఈ నెల ఆరో తేదీన కిడ్నాప్‌కు పాల్పడిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్టు చేసినట్టు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు తెలిపారు. వారి నుంచి కిడ్నాప్‌కు వినియోగించిన ఒక మోటారు సైకిల్, ఒక కారు, తులంన్నర బంగారు వస్తువులు, ఫిర్యాదుదారుడిని బెదిరించి, బలవంతంగా సంతకాలు చేయించిన ఖాళీ ప్రాంసరీ నోట్లు, ఖాళీ తెల్లకాగితాలు, ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. పట్టణంలోని బొందెలగూడెంకు చెందిన జోగ శివకిశోర్, జమ్ము నారాయణపురానికి చెందిన కటకోటి సతీష్‌కు మార్ షాపును అద్దెకు తీసుకున్నాడు. మంచినీటి సరఫరా చేసే వ్యాపారం నిర్వహించాడు. ఈ క్రమంలో ఇరువురి మధ్య స్నేహం ఏర్పడింది. దీంతో బాధితుడు జోగ శివకిశోర్ నుంచి రూ.7 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. సకాలంలో అప్పును చెల్లించకపోవడంతో కిశోర్ కోర్టులో సతీష్‌పై కేసు వేశాడు. ఆర్థిక విషయాలపై ఇరువురి మధ్య గొడవలు జరగడంతో కిశోర్ తన వ్యాపారాన్ని బాబామెట్టకు మార్చేశాడు. దీంతో ఆగ్రహించిన సతీష్ కిశోర్‌ను కిడ్నాప్ చేసేందుకు అతని స్నేహితుడైన భీమిలికి చెందిన చుక్కా నూతన్ సాయికుమార్‌ను ఆశ్రయించాడు. అతనికి ఈ తరహా దందాలకు పాల్పడే భీమిలికి చెందిన బంగారి గణేష్ పరిచయం చేశాడు. వారి గ్యాంగ్‌తో కిడ్నాప్ చేసేందుకు రూ.7 లక్షలకు ఒప్పందం కుదుర్చుకున్నాడన్నారు. సతీష్ ఫోన్‌పే ద్వారా సాయికుమార్‌కు దఫదఫాలుగా రూ.15వేలు, గణేష్‌కు రూ.15వేలు అడ్వాన్స్‌గా పంపినట్టు విచారణలో వెల్లడైందన్నారు. నిందితులు ఫిర్యాదుదారుడైన శివకిశోర్‌ను కిడ్నాప్ చేసేందుకు ఒక పథకాన్ని రూపొందించి, పథకం ప్రకారం ఫిబ్రవరి 6న బాబామెట్టకు గ్యాంగ్ సభ్యులు చేరుకున్నారు. ఫిర్యాదుదారుడు వాటర్ సరఫరా చేసేందుకు మారుతీ ఒమ్ని వ్యాన్‌లో బయలుదేరుతుండగా భీమిలికి చెందిన సురగల వరలక్ష్మి, ఇద్దరు జువైనల్స్ ఏపీ 35 ఏహెచ్ 2302 నంబరు గల మోటారు సైకిల్‌పై వచ్చి, మారుతీ ఒమ్ని వ్యాన్‌కు అడ్డంగా పడిపోయినట్టు నటించారు. నిందితులు ఏపీ 39 బిజి 2542 షిఫ్ట్ డిజైర్ కారులో వచ్చి, శివకిశోర్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకుని, పూసపాటిరేగ మైలాన్ కంపెనీ వైపు తీసుకువెళ్లి, అక్కడ కత్తితో బెదిరించి, 15 ఖాళీ ప్రాంసరీ నోట్ల మీద, తెల్లకాగితాల మీద, ఆధార్‌కార్డు జెరాక్స్‌లపైన సంతకాలు చేయించుకున్నారు. విచక్షణ రహితంగా చేతులతో ముఖం మీద కొట్టారు. ఆయన వద్ద ఉన్న రూ.1500 నగదు, తులంన్నర బరువు గల ఒక చైన్, రెండు ఉంగరాలను కూడా బలవంతంగా తీసుకుని, ఫిర్యాదును అక్కడే విడిచిపెట్టి వెళ్లిపోయారని డీఎస్పీ వివరించారు. బంగారి గణేష్ గతంలో ఆనందపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఒక హత్యకేసులో నిందితుడిగా ఉన్నాడు. అతనిపై రౌడీషీట్ ఉంది. నిందితులందరూ ఒక ముఠాగా ఏర్పడి, ఈ కిడ్నాప్‌కు ప్రయత్నించారని తెలిపారు. నిందితుల నుంచి మొబైల్ ఫోన్, రూ.1500 నగదు, అరతులం బరువు గల రెండు బంగారు ఉంగరాలు, తులం బరువు గల ఒక బంగారు చైన్, ఏపీ 35 ఏహెచ్ 2302 మోటారు సైకిల్, ఏపీ 39 బిజి 2542 షిఫ్ట్ డిజైర్ కారును స్వాధీనం చేసుకున్నామన్నారు. బంగారు వస్తువులను భీమిలి ముత్తూట్ ఫైనాన్స్‌లో కుదువపెట్టి, కారును ఒక్క రోజుకు అద్దెకు తీసుకున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారని డీఎస్పీ వివరించారు. కేసును తీవ్రంగా పరిగణించిన ఎస్పీ ఎం.దీపిక ఆదేశాలతో టూటౌన్ సీఐ కోరాడ రామారావు ఆధ్వర్యంలో ఎస్ఐలు దుర్గాప్రసాద్, రాజేష్, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది చాకచక్యంగా వ్యవహరించి, కిడ్నాప్ కేసు మిస్టరీని ఛేదించారు. ఇందులో క్రియాశీలకంగా పనిచేసిన అధికారులను ఎస్పీ అభినందించారని డీఎస్పీ తెలిపారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

బాడంగి: స్నానానికి బావి దగ్గరకు వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడిపోయి దామోదర పాత్రుని రామారావు(65) శనివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు...మండలంలోని పూడివలసలో గతంలో నివాసం ఉండే రామారావు ప్రస్తుతం విశాఖలోని మల్కాపురంలో కుమార్తె వద్ద ఉంటున్నాడు. మండలంలోని ముగడ కాలనీలో అన్న కుమారుడు ఉండడంతో గురువారం సాయంత్రం ఇక్కడకు వచ్చి సాయంత్రం తిరిగి పూడివలస వెళ్లిపోతానని బయలుదేరారు. సామాజిక పింఛన్ కోసం గ్రామానికి వచ్చి కొద్ది రోజులు పాటు ఇక్కడే ఉంటున్న రామారావు బావిలో ఎప్పుడు పడిపోయాడో తెలియలేదు. బావిలో రామారావు మృతదేహాన్ని శనివారం గ్రామస్తులు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ప్రమాదవశాత్తు పడిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఆర్.జయంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి తరలించినట్టు పోలీసులు తెలిపారు.


మృతుడు రామారావు(ఫైల్)